క్లుప్తంగా

పరిశుభ్రత పాటించాలి



ఆర్మూర్‌టౌన్‌: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సూచించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం పెర్కిట్, మామిడిపల్లి, హౌసింగ్‌బోర్డులోని ఆరోగ్యకేంద్ర వైద్యసిబ్బందికి డెంగీపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, వైద్యులు ఆయేషా, మానస, శ్వేత, సాయి, చంద్రశేఖర్, ఆశ కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు గణేశ్, మోహన్ పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు అందజేత

పెర్కిట్(ఆర్మూర్): మున్సిపాలిటీ పరిధిలోని 20, 21,26 వార్డుల పరిధిలోని ఓటర్లకు బూత్‌స్థాయి అధికారులు ఓటరు స్లిప్పులతోపాటు ఓటరు గైడ్ లైన్ పత్రాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు చెన్న గంగామోహన్, నర్సయ్య, గంగాధర్ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులంతా ఒకేసారి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయికి గురుకుల విద్యార్థులు



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణంలోని పిప్రి రోడ్డులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ అండర్–14 ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 10న ఆర్మూర్‌లో నిర్వహించిన అండర్–14 ఫుట్‌బాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబర్చిన టి సుశాంత్, కే కార్తీక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 17,18,19 తేదీల్లో గద్వాల్ జోగులాంబ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు.

రేవంత్ దిష్టిబొమ్మ దహనం

ఆర్మూర్‌టౌన్‌: బీసీ నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. బీసీలను విస్మరిస్తున్న కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దని కోరారు. కాంగ్రెస్ రెడ్డిలకు, దొరలకు, రావులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిందని ఆరోపించారు. బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులు, యువకులు వంశీ, జక్కం, శివ, నరేష్, భాను, సురేశ్, కిషోర్, సత్య, ఆర్యన్, అజయ్ పాల్గొన్నారు.

రుణం ఇప్పించాలని వినతి

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌కు చెందిన భువనేశ్వరి మహిళా సంఘం సభ్యులకు తమకు బ్యాంకు రుణం ఇప్పించాలని తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. తమ గ్రూపులోని ఓ సభ్యురాలు తాను తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించలేదని, రుణ మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తే నెల తర్వాత కొత్త రుణం ఇప్పిస్తానని సీసీ రవి సూచన మేరకు తామే పూర్తిగా చెల్లించామని తెలిపారు. తర్వాత రుణం కోసం సీసీని అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతూ మూడేళ్ల నుంచి తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

వాహనాలను తనిఖీ చేయాలి

ఆర్మూర్‌టౌన్‌: ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం రవాణాకాకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్ ఎస్ఎస్‌టీ చెక్‌పోస్ట్ వద్ద అధికారులు గురువారం చేపట్టిన వాహనాల తనిఖీని ఆయన పరిశీలించారు.

పరిశ్రమల రుణాలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్‌: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పట్టణంలోని వినియోగదారులకు సూక్ష్మతరహా పరిశ్రమల రుణాలపై గురువారం అవగాహన కల్పించారు. బ్యాంకు నిజామాబాద్ ప్రాంత రీజినల్ హెడ్ శంకర్ హేంబ్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సూక్ష్మతరహా పరిశ్రమలకు బ్యాంకులు అందించే రుణాల గురించి వివరించారు. పలువురికి రుణ మంజూరుపత్రాలను అందజేశారు. ఏజీఎం మన్యం, వినియోగదారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

నందిపేట్(ఆర్మూర్): నందిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీ నిర్ధారణ కోసం పలువురి నుంచి శాంపిళ్లను సేకరించారు. డాక్టర్ ప్రవీణ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవన్న, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి బాటను వీడను

- బీఆర్‌ఎస్‌తో ప్రగతి.. కాంగ్రెస్, బీజేపీలతో దుర్గతి
- ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



బజార్‌కొత్తూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్/డొంకేశ్వర్ (ఆర్మూర్) : అభివృద్ధి బాటను వీడనని, జనం మాట జవదాటనని ఆర్మూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నందిపేట మండలంలోని మాయాపూర్, బజార్‌కొత్తూర్, డొంకేశ్వర్ మండల కేంద్రంలో గురువారం 'ప్రజా ఆశీర్వాద యాత్ర' నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జీవన్‌రెడ్డికి ఘనస్వాగతం పలుకగా, గ్రామాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఆయన ప్రజల ముందుంచారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌తో ప్రగతి సాధ్యమని, కాంగ్రెస్, బీజేపీలతో దుర్గతి పడుతుందని అన్నారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరువు కాటకాలు, కర్ఫ్యూలు, అవినీతి, అరాచకం, రౌడీయిజంతో ప్రజల బతుకులు నాశనమవుతాయని, బీజేపీ వస్తే మతచిచ్చురేగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మూర్ నియోజకవర్గమంతా ఒక్కటై తనను దీవించాలని, హ్యాట్రిక్ విజయాన్నందించి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాలని కోరారు. గత ప్రభుత్వాల హయాంలో ఆర్మూర్ నుంచి ప్రాతినిధ్యం వహించిన హేమాహేమీలు చేయలేని, అసాధ్యమనుకున్న పనులను తాను చేసి చూపానని అన్నారు. కొత్తగా డొంకేశ్వర్, ఆలూరులను మండలాలను ఏర్పాటు చేశామని, గొల్ల, కురుమ సోదరులకు గొర్రెల యూనిట్లు మంజూరు చేయడంతోపాటు రూ.450 కోట్లు వెచ్చించి నియోజకవర్గంలోని 81 గ్రామాలకు, 36 వార్డులకు ఇంటింటికీ మిషన్ భగీరథ మంచి నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గురుకుల విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.లక్షా 25వేల చొప్పున ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యనందిస్తున్నామని తెలిపారు. రూ. 120కోట్లతో ఫత్తేపూర్–చేపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సాధించానని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఆర్థికసాయం అందించి 15వేల నుంచి 20వేల మంది పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు జరిపించామన్నారు. గుండ్ల చెరువు ట్యాంక్‌బండ్‌ను అభివృద్ధి చేశామని తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన ఆర్మూర్‌ను సుందర పట్టణంగా తీర్చిదిద్దామని, విశాలమైన రోడ్లు, అధునాతన డ్రైనేజీలతో ప్రజల కష్టాలు తొలిగిపోయాయని పేర్కొన్నారు. బైపాస్‌రోడ్లు ఆర్మూర్ మెడలో మణిహారాలుగా మెరుస్తున్నాయని అన్నారు. చెత్త డంప్‌యార్డులు, వైకుంఠ ధామాలు నిర్మించామని, పట్టణ జనాభా ప్రకారం రూ.7.20 కోట్లతో వెజ్, నాన్ వెజ్, ఫ్రూట్, ఫ్లవర్ మార్కెట్లు నిర్మిస్తున్నామని తెలిపారు. యువత కోసం క్రీడా ప్రాంగణాలు నిర్మించడంతోపాటు ఆర్మూర్ అర్బన్ పార్కుతో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టామని అన్నారు. సిద్దులగుట్టకు ఘాట్ రోడ్డు వేయడంతో ఆర్మూర్‌కు ఆధ్యాత్మిక శోభ, పర్యాటక కళ వచ్చిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్లు రూ.5వేలకు, దివ్యాంగుల పింఛన్లు రూ.6వేలకు, రైతుబంధు సాయం రూ.16వేలకు పెరుగుతాయన్నారు. రూ.400 గ్యాస్‌సిలిండర్ అందించడంతోపాటు ఇంటింటికీ కేసీఆర్ బీమా పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. ఇవి తెలంగాణ ఆత్మ గౌరవానికి, ఢిల్లీ పెద్దల అహంకారానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని, ప్రజలు ఏ మాత్రం పొరబడినా పోరాడి సాధించుకున్న తెలంగాణ మళ్లీ ద్రోహులు, గుంటనక్కల పాలై మన బతుకులు బానిసత్వం పాలయ్యే ప్రమాదం ఉందని జీవన్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు



చౌట్‌పల్లిలో మాట్లాడుతున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి



బోనాలతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

- కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే అభివృద్ధిని దూరం చేసుకున్నట్టే
- రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే చౌట్‌పల్లి–మెట్ల చిట్టాపూర్ రోడ్డు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: తెలంగాణ ప్రజల కోసం త్యాగాలు చేసిన ఏకైక నాయకుడు సీఎం కేసీఆర్ అని, అలాంటి వ్యక్తిని వేటాడేందుకు వచ్చిన వేటగాడినని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదమని బాల్కొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రేవంత్ వేటకు వచ్చిన తుపాకి రాముడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే అభివృద్ధిని దూరం చేసుకున్నట్టేనని పేర్కొన్నారు. మండలంలోని చౌట్‌పల్లి, బషీరాబాద్ గ్రామాల్లో ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రశాంత్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గంటల కరెంటు ఇవ్వలేక పోతున్నదని, ఆ పార్టీకి ఓటేస్తే తెలంగాణలో కరెంటు పరిస్థితి ఏమవుతుందో ఆలోచించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో వ్యవసాయానికి కరెంటు ఇచ్చి ప్రోత్సహించడం లేదన్నారు. మహారాష్ట్రలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.1.80 లక్షలు డీడీ చెల్లించాల్సి ఉంటుందని, మన దగ్గర రూ.6 వేలు మాత్రమే చెల్లిస్తున్నామన్నారు. మహారాష్ట్రలో వ్యవసాయ విద్యుత్‌కు బిల్లు చెల్లించాలని అన్నారు. బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే కొత్త బీడీ పీఎఫ్ వచ్చిన వారికి పింఛన్ ఇస్తామని ప్రకటించినట్లు గుర్తు చేశారు. కొత్త రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. రుణమాఫీపై ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. ప్రతిరైతుకు రుణమాఫీ జరిగి తీరుతుందని, ఇందుకు తనతో పాటు ఎంపీ సురేశ్‌రెడ్డిది జిమ్మేదార్ అని హామీ ఇచ్చారు. చౌట్‌పల్లి తన సొంత గ్రామం వంటిదని, రూ.60.36 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. బషీరాబాద్‌లో మాటు కాలువ గండ్లు పడుతున్న చోట సీసీ లైనింగ్ వేయిస్తానని హామీ ఇచ్చారు. గట్టు పొడిచిన వాగు ప్రాజెక్టు, హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల నీళ్లు బషీరాబాద్‌కు పరిపూర్ణంగా అందేలా చేసి రెండు పంటలు పండేలా చేసే బాధ్యత తనదన్నారు. ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో అభివృద్ధి పనులు చేసిన ప్రశాంత్‌రెడ్డికి మన దగ్గరకు వచ్చి ఓటు అడిగే హక్కు ఉందన్నారు. యాదవులు గొర్రెపిల్లను, గంగపుత్రులు చేపలను, చేపబుట్టలను మంత్రికి బహుమతిగా అందజేశారు. నాయకులు కోటపాటి నర్సింహానాయుడు, బాలేరావు రాజేశ్వర్, దేవేందర్, లింగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే బంజార, గిరిజనుల అభివృద్ధి

- కాంగ్రెస్‌ను నమ్మితే అమ్ముడుబోతారు
- బాల్కొండ బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణమ్మ



ప్రచారంలో మాట్లాడుతున్న ఏలేటి అన్నపూర్ణమ్మ

భీమ్‌గల్/వేల్పూర్ : బంజార, గిరిజనుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వారికి తీవ్ర అన్యాయం చేశాయని బాల్కొండ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణమ్మ అన్నారు. భీమ్‌గల్ మండలం రహత్‌నగర్, తాళ్లపల్లి, వేల్పూర్ మండలం పడగల్, పోచంపల్లి గ్రామాల్లో అన్నపూర్ణమ్మ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కాంగ్రెస్‌ను నమ్మితే అమ్ముడుపోతారని ఆరోపించారు. పోడు భూముల పట్టాలు అసలైన లబ్ధిదారులకు ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో చేసే ప్రతిపనిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి 30శాతం కమీషన్ తీసుకోవడం కారణంగానే పనులన్నీ నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు అర్హులకు ఇవ్వకుండా పార్టీ కార్యకర్తలకే ఇచ్చుకొని సామాన్యులకు అన్యాయం చేశారని మండిపడ్డారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ పదేళ్లగా అప్పులకుప్పగా తయారు చేశారన్నారు. కేసీఆర్ కుటుంబం తెలంగాణరాష్ట్రాన్ని వాడుకుంటున్నదన్నారు. ప్రధానమంత్రి ప్రకటించిన పసుపుబోర్డుతో ప్రతిపక్షాల్లో భయం ఏర్పడిందన్నారు. బాల్కొండలో బీజేపీ గెలిస్తే అర్హులందరికీ వృద్ధాప్య పింఛన్లు, రేషన్‌కార్డులు ఇప్పిస్తామన్నారు. అంతేగాక రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తుందని, విద్య, వైద్యానికి బీజేపీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందన్నారు. భీమ్‌గల్ మండలంలో నిర్వహించిన ప్రచారంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లన్న గారి మోహన్, మండల అధ్యక్షుడు ములిగే మహిపాల్, వేల్పూర్ మండలంలో నిర్వహించిన ప్రచారంలో మండల అధ్యక్షుడు ఏలేటి రమేశ్‌రెడ్డి, మల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే

- వారి మధ్య లోపాయికారి ఒప్పందం
- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



నీలాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

రెంజల్/బోధన్‌టౌన్(బోధన్): బీఆర్‌ఎస్, బీజేపీలు రెండు ఒక్కటేనని, అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరుగా పోటీ చేస్తున్నప్పటికీ లోపాయికారి ఒప్పందంతో కలిసి పని చేస్తున్నాయని బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రెంజల్ మండలం నీలా, కందకుర్తి, బోధన్ పట్టణంలోని ఆయా వార్డుల్లో గురువారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగుల్లో ఆయన మాట్లాడారు. తన హయాంలో చేసిన అభివృద్ధిని వివరించిన సుదర్శన్‌రెడ్డి.. బీఆర్‌ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ తుంగలో తొక్కిందని విమర్శించారు. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాలు భూమి, డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎంత మందికి పంపిణీ చేశారని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తమకు అన్యాయం జరిగిందని ప్రజలు పేర్కొనగా.. వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటేయాలో నిర్ణయించుకోవాలని ఆయన వారికి సూచించారు. రైతురుణమాఫీ అంటూ రైతులకు నమ్మక ద్రోహం చేస్తున్నారని, ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు మాఫీ వర్తించిందో చెప్పాలన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కేంద్రంలో బీజేపీ ప్రజల ఆస్తులను విక్రయించి లాభపడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ లాగా తనకు అక్రమంగా సంపాదించాల్సిన అవసరంలేదన్నారు. కమీషన్‌లు లేనిదే పనులు కావట్లేదని ప్రజలు తన దృష్టికి తీసుకవస్తున్నారన్నారు. అధికార పార్టీ వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, అర్హులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టనుందని, కాంగ్రెస్‌ను గెలిపించాలని ఆయన కోరారు. బోధన్ పట్టణంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్‌చారి, పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్, ప్రధాన కార్యదర్శి విష్ణు, నాయకులు ఎజాస్, ఇనాయత్, బడు, రెంజల్ మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మోబీన్‌ఖాన్, సాయారెడ్డి, నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, ఎంఎల్ రాజు, సద్దాం, పోచయ్య, చిలుక అశోక్, రాకేశ్, గంగాకృష్ణ, జావీద్, సాయిబాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ద్వారా బుద్ధిచెప్పాలి



ఆర్మూర్‌టౌన్‌: ఎన్నికల్లో ప్రజలు నియంతృత్వ, మతోన్మాద, పాసిస్ట్ బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలను ఓటు ద్వారా ఓడించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ప్రభాకర్ అన్నారు. ఎన్నికలపై అవగాహన కోసం సీపీఐఎంఎల్ ప్రజాపంథా ఎన్నికల పోస్టర్లను పట్టణంలో గురువారం ఆయన ఆవిష్కరించారు. నాయకులు దేవారం, రామకృష్ణ, ముత్తెన్న, కిషన్, నరేందర్, నజీర్, అరవింద్ పాల్గొన్నారు.

నేడు పరిష్కార వేదిక

నందిపేట్ (ఆర్మూర్): నందిపేట్, మాక్లూర్ మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను శుక్రవారం నందిపేటలోని సబ్ స్టేషన్‌లో నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఎం అశోక్ తెలిపారు. వినియోగదారులు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందని తెలిపారు.

బీజేపీలో సొసైటీ డైరెక్టర్ల చేరిక



పార్టీలో చేరిన వారితో పైడి రాకేశ్‌రెడ్డి

నందిపేట్/మాక్లూర్ (ఆర్మూర్): నందిపేట మండలంలోని చింరాజ్‌పల్లి సహకార సంఘం డైరెక్టర్లు పలువురు గురువారం బీజేపీలో చేరారు . డైరెక్టర్లు అవుల్దాపూర్ సాయిరెడ్డి, తోట దేవేందర్, సాయన్న 100మందితో కలిసి బీజేపీలో చేరగా, ఆర్మూర్ నియోజవర్గ పార్టీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాల్పడుతున్న అవినీతికి అడ్డు చెప్పే నాయకుడు రాకేశ్‌రెడ్డి అని, ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకే బీజేపీలో చేరామన్నారు. కార్యక్రమంలో కంచెట్టి గంగాధర్, పల్లె గంగారెడ్డి, యామాద్రి భాస్కర్, లక్కంపల్లి చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు. మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ అనిల్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల స్థాయి నాయకులు కొత్తపల్లి గంగాధర్, భాగ్యం నర్సయ్యతోపాటు మరికొంత మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు బీజేపీలో చేరారు. నాయకులు కంచెట్టి గంగాధర్, పాలెపు రాజులు పాల్గొన్నారు.

నాయకుల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్‌: బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా పార్టీ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి రుద్రూర్ మండలంలో, బాల్కొండ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా వేల్పూర్ మండలం కుకునూర్, రామన్నపేట్ గ్రామాల్లో, ఆర్మూర్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి మద్దతుగా మున్సిపాలిటీ పరిధిలోని పెర్కిట్‌లో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా బోధన్ మండలం అమ్దాపూర్, ఊటపల్లి, రాజీవ్‌నగర్ తాండ, బెల్లాల్, ఏరాజ్‌పల్లి గ్రామాల్లో నాయకులు ఇన్‌ఫ్లాటబుల్ బెలూన్స్‌తో ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు.

ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం

- బీఆర్‌ఎస్ మోసం, దోపిడీ చేసింది
- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి



బషీరాబాద్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి



హాజరైన మహిళలు, గ్రామస్తులు

కమ్మర్‌పల్లి: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బషీరాబాద్, చౌట్‌పల్లి, హాసాకొత్తూర్ గ్రామాల్లో గురువారం రాత్రి సునీల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మహిళ ఖాతాలో మహాలక్ష్మి పథకం కింద రూ. 2500 జమ చేయడంతోపాటు పింఛన్ రూ.4000లకు పెంచుతామన్నారు. రైతు భరోసా కింద రూ.15వేల పెట్టుబడి సాయం, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, విద్యార్థులకు 5 లక్షల విద్యాకార్డులు, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తామని వివరించారు. ప్రజలను బీఆర్‌ఎస్ మోసం, దోపిడీ చేసిందని, ఆ పార్టీపై తిరగబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఏలేటి గంగాధర్, కస్తూరి శ్రీను, మురళి, కుమ్మరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకుడు

వేల్పూర్: వేల్పూర్ మండల బీజేపీ సీనియర్ నాయకుడు పన్నాల రాజేశ్వర్ ముత్యాల సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు సునీల్ కుమార్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.05
స్పార్క్ లైఫ్ (తెలుగు)-1.30, 10.30
మా ఊరి పొలిమేర-2(తెలుగు) – 5.00
కీడా కోలా(తెలుగు) – 7.50

స్క్రీన్-2 – మంగళవారం (తెలుగు)- 10.00, 1.10, 4.20, 7.30, 10.40

స్క్రీన్-3 – అన్వేషి (తెలుగు)- 10.00
సప్త సాగరాలు(తెలుగు)- 12.50, 4.00, 7.10
టైగర్-3 (తెలుగు)- 10.20

స్క్రీన్-4 – టైగర్-3 (తెలుగు)- 11.15, 2.40, 6.05, 9.30

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- ఎన్నికల ప్రచారంలో జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి



ప్రచారం చేస్తున్న జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి

ఆర్మూర్: మహిళల సంక్షేమానికి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండలంలోని అన్నారం, సిర్పూర్, జీజీ నడ్కుడ, దత్తాపూర్, తొండాకూర్ గ్రామాలతోపాటు నందిపేట మండలంలోని షాపూర్‌లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో రూ.200 ఉన్న పింఛన్లను కేసీఆర్ రూ.2వేలకు పెంచారన్నారు. మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్లను దశలవారీగా రూ.5వేలకు, దివ్యాంగుల పింఛన్లను రూ.6వేలకు పెంచుతామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారన్నారు. ఏ ప్రభుత్వమూ పట్టించుకోని ఒంటరి మహిళలతోపాటు వితంతులకు కూడా పింఛన్లు అందజేస్తున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. రోజురోజుకీ కుదేలవుతున్న బీడీ కార్మిక మహిళలకు జీవన భృతిని అందిస్తున్న కేసీఆర్.. మళ్లీ అధికారంలోకి వస్తే మరింత మంది అర్హులను గుర్తించి భృతిని అందజేస్తారన్నారు. వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలు, గర్భిణులు, చిన్నారులు, బాలికలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్న కేసీఆర్ వంటి వ్యక్తి.. మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తే రాష్ట్రంలోని ప్రతి మహిళ గర్వపడేలా పాలన అందిస్తారన్నారు. కేజీబీవీలు, గురుకులాల్లో బాలికలకు ఉచిత విద్యతోపాటు కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ఆర్మూర్ నియోజకవర్గం అభివృద్ధికి కనీవినీ ఎరుగని రీతిలో నిధులు రాబట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్న ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేసీఆర్ మూడో పర్యాయం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఆమె వెంట మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం.మధుసూధన్ (ACO) : 9951027699
రాంనాథ్ (నిజామాబాద్ అర్బన్ & రూరల్) : 7997958181
ఎ.శివ (ఆర్మూర్) : 9848956776
పి.కళ్యాణ్ (బోధన్) : 83281 91021
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899